## మాస్టర్ ట్రైనర్లతో రెండవ విడత శిక్షణ కార్యక్రమాలు

**-వికారాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ**


శిక్షణ తరగతులను కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ

**వికారాబాద్,నవంబర్ 17, ప్రభాతవార్త:** ఎన్నికల విధుల నిర్వహణకు కేటాయించిన పిఓలు, ఏపీఓలకు ఈనెల మూడు రోజుల పాటు మాస్టర్ ట్రైనర్లతో రెండవ విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని వికారాబాద్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రైనింగ్ నోడల్ అధికారి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 21, 22, 23 తేదీలలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ సిబ్బంది పిఓలు, ఏపీఓ లకు రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఇక్కడే పోస్టల్ బ్యాలెట్ వినియోగం కొరకు సదుపాయం కల్పించాలని సూచించారు. శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఐదు గదులను, పోస్టల్ బ్యాలెట్ వినియోగం కొరకు ఐదు గదులను కేటాయించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ సమయంలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ వినియోగం కొరకు ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ట్రైనింగ్ నోడల్ అధికారి సత్తయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి గణేష్, వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కవాతు నిర్వహించిన పోలీసు అధికారులు


కడ్తాల్ పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

**కడ్తాల్,నవంబరు 17 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. కవాతులో పోలీసు అధికారులు, సిబ్బంది ఆర్మీ బలగాలు పాల్గొన్నాయి. జాతీయ రహదారితో పాటు, ప్రధాన కాలనీల మీదుగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలీసు బలగాలతో కవాతు నిర్వహించం జరిగిందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై హరిశంకర్‌గౌడ్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల అబ్జర్వర్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

**కొత్తూర్, నవంబర్ 17, ప్రభాతవార్త :** కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ, పెంజర్ల, కొడిచెర్ల,మల్లాపూర్, గూడూర్, తీగాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఐఏఎస్ అధికారి ఎన్నికల అబ్జర్వర్ చంద్రకాంత్ డాంగే సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్ల గురించి అదేవిధంగా హెల్త్ సెంటర్‌లో తాగునీటి సమస్యలు ఉండకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శరత్ చంద్రబాబు, తహసీల్దార్ జానకి, ఇన్స్పెక్టర్, ఆర్ఐ రాంబాబు, ఎంఈవో కృష్ణరెడ్డి, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

# రసకందాయంగా తాండూరు "రాజకీయం"

**- పట్టు నిలుపుకోవడమే లక్ష్యంగా దూసుకుపోతున్న ప్రతిపక్ష పార్టీ**
**- 'కారు' స్పీడుకు బ్రేకులు తప్పవంటున్న విశ్లేషకులు**






**తాండూరు, నవంబరు 17, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో 'రాజకీయం' రసకందాయంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీల ప్రచారం జోరందుకుంది. ఎన్నికల పోరులో ఎలాగైనా పట్టు నిలుపుకోవడమే లక్ష్యంగా అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తహతహలాడుతున్నాయి. ఇందుకోసం ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో తాండూరు మండలంతో పాటు పెద్దేముల్, బషీరాబాద్ యాలాల మండలాలలో ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు ఎవరికి వారు పట్టు సాధించే దిశగాపావులు కదుపుతున్నారు. ఎలాగైనా తాండూరులో పట్టు నిలుపుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డిలు ఎవరికి వారు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్ మూడు మండలాలలో బీఆర్ఎస్‌కు ఎదురు గాలీ వీస్తుంది. ఇప్పటికే ఆయా మండలాల నుండి పెద్ద ఎత్తున ఎంపీపీలు, జెడ్పిటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతలు కారు దిగి హస్తం వైపు పరుగు తీసిన విషయం తెలిసిందే. యాలాల మండలంలో మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎవరికి వారు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో కూడ ఇప్పటికే పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సారి ఎలాగైనా తాండూరులో రోహిత్‌రెడ్డిని ఓడించాలని కంకణబద్దులుగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి ప్రచారం జోరు పెంచారు. ఎలాగైనా తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే 'రాజకీయ' పాచికలతో ముందుకు దూసుకుపోతున్నారు. అయితే, అధికార బీఆర్ఎస్ పార్టీలో కొందరు అనుచరులు అనుసరిస్తున్న తీరుపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డికి ఎదురీత తప్పదని పలువురు రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా తాండూరులో మాత్రం ప్రస్తుత పరిస్థితులలో బీఆర్ఎస్ పార్టీ 'కారు' స్పీడుకు బ్రేకులు తప్పేలా లేదని భావిస్తున్నారు. తాండూరులో రాజకీయం వెడె క్కడంతో పాటు అధికార పార్టీ నేతల గుండెల్లో గుబులు రేపు తుందనే చెప్పవచ్చు.

## ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

**-ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి**
**-జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీ కేరీ సూచన**


రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీ కేరీ

**చేవెళ్ల, నవంబర్ 17, ప్రభాతవార్త** ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ నింబంధలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీ కేరీ సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనను కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబందించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీ కేరీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఏలాంటి పోరపాట్లు జరుగకుండా ప్రతి ఒక్కరు విధులను నిర్వహిలన్నారు. ఈవీఎంల నిర్వహిణ, బ్యాలెట్ పత్రాలు ముద్రణలో ఏలాంటి తప్పిదాలకు తావివ్వకుడదన్నారు. రిటర్నింగ్ అధికారి పరిధిలోని అన్ని టీంలకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కల్గించాలన్నారు. ఎన్నికల పంపిణీ కేంద్రాల నుండి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ సెంటర్‌లకు జాగ్రత్తగా తీసుకువెళ్లెవిధంగా పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన త్రాగునీరు, విద్యుత్ సరఫరా ఫర్నిచర్ టాయిలెట్స్ వసతులను పరిశీలించాలన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు.పోస్టల్ బ్యాలెట్ విషయంలోను జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిడబ్ల్యుడి,సినియర్ టిటిజన్స్‌కు ఫాం-12డి ఇవ్వాలన్నారు. ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్పులను వంద శాతం పంపిణీ చేయాలన్నారు.పోలింగ్ ప్రక్రియకు అవసరమైన విషయాలను పనులు ముందస్తు ప్రణాలికతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు,పోలీస్ అధికారులు, రవాణా శాఖ అధికారులు ,ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పల్లెలో మల్‌రెడ్డి రంగారెడ్డికి బ్రహ్మరథం


ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి


ఇబ్రహీంపట్నం ఎంపిపి సోదరుడు వంది సురేష్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన దృశ్యం

**ఆదిభట్ల నవంబరు17,ప్రభాతవార్త :** నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కాంగ్రెస్ ఓటు వేసి గెలిపించాలని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిభట్ల మున్సిపాలిటీలోని రాందాస్‌పల్లి,మలిశెట్టి గూడ,చింతపల్లి గూడ,ఆదిభట్ల,బొంగులూరు,ఎంపి పటేల్ గూడ,మంగళపల్లి,సాహెబ్ గూడ,కొంగరకలన్‌లలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి అభిమానులు,నాయకులు మహిళలు పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు.పూలమాల గజమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మార్పు కోరుకునే వారందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.మార్పు కోరుతూ అధికార పార్టీ బీఆర్ఎస్ నుండి ఎంతోమంది కాంగ్రెస్‌లో చేరి విజయానికి కృషి చేస్తున్నారని గురునత చేశారు.నిరంకుశ పాలనకు విముకినత కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆర్థిక గౌడ్ కొత్త కుర్మా శివకుమార్,శేఖర్ గౌడ్, కార్యకర్తలు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు దగ్గర పడుతున్న తొలగని రాతలు


బోపునారం బస్ స్టాండ్‌లో గోడపైన రాసిన బీజేపీ రాతలు


తొరుమామిడిలో పోలింగ్ బూత్ ముందు (ఇన్ సెట్‌లో కనిపిస్తున్నా బీఎస్‌పీ గుర్తు)


తొరుమామిడి ఉర్దు మీడియం పాఠశాల ముందు నీటి ట్యాంక్ పైన బీజేపీ గుర్తు

**బంట్వారం,నవంబరు 17, (ప్రభాతవార్త) :** ఎన్నికల కమీషన్ ఎంత పకడ్బందిగా పని చేస్తె అంత మంచి ప్రజా స్వామ్య ప్రభుత్వాలు ఏర్పడతాయని చెప్పొచ్చు. అయితె రాష్ట్రంలో ఎన్నికల కమీషన్ అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తుందని ఇప్పటికె ప్రతిపక్షాలు ఫిర్యాదులు సైతం చేయడం జరిగింది. గ్రామస్తాయిలో ఎన్నికల నిబందనలు తూచా తప్పకుండ అమలు చేయడం ఎన్నికల అధికారులదే. ఎన్నికల నిబ్బందల మేరకు అనుమతులు లేకుండ ఎన్నికల బోర్డులు, ఫ్లెక్సిలను ఏర్పాటు చేయరాదె. అంతె కాక గోడలపై రాతలను రాయకూడదు. అలాంటివి ఏమైన ఉంటే వెంటనే తొలగించాల్సి ఉంటుంది. అయితే మండలంలో మాత్రం ఎన్నికల కమీషన్ సక్రమంగా పని చేయడం లేదనిపిస్తుంది. ఇందుకు తాజాగ ఉదాహరణలు మండలంలో అక్కడ కనిపిస్తున్నాయి. మండల పరిదిలోని బోపునారం బస్ స్టాండ్‌లో గోడపైన రాసిన బీజేపీ రాతలు చెరపలేదు. ఇదే కాక తొరుమాయిడిలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు పోలింగ్ బూత్‌కు వెళ్ళే దారి లోనే బీఎస్పీకి సంబందించిన గోడ రాతలు తొలగించలేదు. ఇలా గ్రామాల్లో అక్కడక్కడ ఇలాంటి రాతలు కనిపించడంతో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.
ఇప్పటికైన అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను తరిమికొట్టాలి

**-చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం వెల్లడి**


హస్తేపూర్‌లో మంగళ హారతులతో బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం,మాజీ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డికి స్వాగతం పలికిన మహిళలు

**చేవెళ్ల, నవంబర్ 17, ప్రభాతవార్త** గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఎం చేశారని ఓట్లు అడుగటానికి వస్తున్నారని, చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య గ్రామాలకు వస్తే తరిమి కోట్టాలని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలం మడికట్టు, తంగడ్‌పల్లి, దుద్దాగు, తలారం, కౌకుంట్ల, అంతారం, హస్తేపూర్, నావులాయపల్లి, కుమ్మెర, ముడిమ్యాల, రావులపల్లి, మల్కాపూర్ గ్రామాలల్లో చేవెళ్ల మాజీ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాలల్లో మహిళలు మంగళ హారతులతో జనం బ్రహ్మరథం పలికారు. ఈ సందర్బంగా చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో ఏం అభివృద్ది చేశారని, ప్రజలను మోసం చేసింది సరిపోలేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా స్వంత స్వలాభం కోసం ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకున్న కాలె యాదయ్యకు గుణ పాఠం చేప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ దందాలు చేస్తూ ప్రజలను బేదిరింపులకు గురి చేస్తూ అమాయకులపై కెసులు పెట్టించిన సంగతి ప్రజలు మర్చిపోలేరన్నారు.చేవెళ్లలో రోజు రోజుకు ప్రజల ఆదరణ పెరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.గతంలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చేసిన అభివృద్ది మాత్రమే గ్రామాలల్లో కన్పిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక బిఆర్ఎస్ ప్రభుత్వంకు తగిన గుణపాఠం చేప్పాలన్నారు. ప్రజల అందదండలతో బిజెపి చేవెళ్లలో విజయం సాధించడం జరుగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా బిజెపి పార్టీ నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల శాఖ అద్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి, సినియర్ నాయకులు వెంకట్‌రాంరెడ్డి,అత్తెల్లి మదుసూదన్‌రెడ్డి, అంజనేయులు, ఖానాపూర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఎన్నికల పరిశీలికులు

**ఇబ్రహీంపట్నం, నవంబరు 17, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం ఎన్నికల పరిశీలకులు ఆర్.ఎస్.నినామ (ఐఏఎస్) మధ్యాహ్నం 12:00గంటల నుండి 1:00గంటల వరకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అనంతరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికలపై ఏవైన ఫిర్యాదులు, అభ్యంతరాలుంటే అయన్ను నేరుగా లేదా సెల్: 9426018818 సంప్రదించి నివృత్తి చేసుకొవాలని తెలిపారు.

## ర్యాండమైజేషన్ ఆధారంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పంపిణీ

**- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్**


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల వారి సమక్షంలో కలెక్టర్ గౌతమ్ ర్యాండర్యాండమైజేషన్ ఆధారంగ బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పంపిణీ చేసిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 17, ప్రభాతవార్త** జిల్లాలో ర్యాండమైజేషన్ సంఖ్యను ఆధారంగ తీసుకుని అవసరమైన నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పంపిణీ చేయటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు,ప్రతినిధులతో కలిసి మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, నియోజకవర్గాలకు సంబంధించి ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అదనపు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయింపులు జరిపారు. ఈ సందర్భంగ మేడ్చల్ నియోజకవర్గంకు సంబంధించి 735బ్యాలెట్ యూనిట్లు, 5కంట్రోల్ యూనిట్లు, కుత్బుల్లాపూర్‌కు సంబంధించి 12బ్యాలెట్ యూనిట్లు, 12కంట్రోల్ యూనిట్లు, కూకట్‌పల్లికి సంబంధించి 525బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయని, వాటిని ర్యాండమైజేషన్ చేసి అందజేయనున్నట్లు తెలిపారు. రాజకీయ నాయకులు, అధికారుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు ర్యాండమైజేషన్ నిర్వహించారు. మేడ్చల్,కూకట్‌పల్లికి 1కన్నా ఎక్కువగ ఉన్నందున అదనపు బ్యాలెట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్, మల్కాజ్‌గిరి, రెండు కన్నా ఎక్కువగ ఉన్నందున అదనపు బ్యాలెట్ యూనిట్లు ఫస్ట్‌లేవల్ చెక్ ఈవిఎం గోడౌన్‌లో జరుగుతుందని, ఆనంతరం వాటిని ఆయా నియోజకవర్గాలకు పంపటం జరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్ దృష్టికి పలు అంశాలను తీసుకరావటం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో 1500కన్నా ఎక్కువగా ఉంటే అదే స్థలంలో ఆక్సిలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉండే ఫిర్యాదుల పరిష్కారానికి సివిజిల్ యాప్ వినియోగించుకోవాలన్నారు. సువిధ యాప్ 1950ని వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు కలెక్టర్ గౌతమ్ సూచించారు.

# ష్...గప్‌చుప్...



**-ఓటు... 'పట్టు' చీరలు... - చీకటి సమయాల్లో ప్రైవేటు టీచర్లతో ఓ జాతీయ పార్టీ సమావేశం**
**- సమావేశం అనంతరం టీచర్లకు చీరల పంపిణీ - మీడియా వారు రావడంతో కొందరికి మాత్రమే**
**- గుట్టు చప్పుడు కాకుండా వచ్చిన వారిని వెనుక నుంచి తరలింపు**
**- రేపు నేరుగా పంపిస్తామని ఇంటికి పంపించిన వైనం**


పంపిణీ చేసిన చీరలు

**షాద్‌నగర్, నవంబర్ 17, (ప్రభాతవార్త) :** ఎన్నికలు వచ్చాయంటే ఓటరు మహాశయులు కింగ్‌లు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి రాజకీయ నాయకులు పడే తంటాలు అంతా ఇంతా కాదు... ఒక్కో వర్గానికి ఒక్కో విధంగా ఏదో ఒకటి ముట్టజేప్పుతూ ఓట్లు దండుకోవడం పరిపాటిగా మారుతుంది. ఓటర్లకు వస్తూ రూపంలోనే ధన రూపంలోనే అందజేసి ఓట్లను రాబట్టాలని చూస్తున్నారు. అదేవిధంగా షాద్‌నగర్‌లోని ఓ జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి రెండు రోజుల క్రితం సాయంత్రం చీకటి పడ్డ తరువాత పట్టణంలోని ప్రైవేటు టీచర్లతో సొంత కాంప్లెక్స్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ఆ నాయకులు మాట్లాడుతూ... ప్రైవేటు స్కూళ్లలో టీచర్ల పరిస్థితి, వారి బాధలను వివరించి ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటు టీచర్లను విస్మరించిందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే మీకు తగిన న్యాయం చేస్తామని వారికి నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేసి, వచ్చిన వారికీ చీరలు పంపిణీ చేశారు. ఇదే సమయంలో కొంత మంది మీడియా వారు అక్కడికి వస్తున్నారన్న సమాచారం తెలుసుకొని ఒక్కసారిగా చీరల పంపిణీ ఆపేశారు. దాంతో కొద్ది మందికి మాత్రమే చీరలు అందాయి. హాడావుడిగా లైట్లుఆఫ్ చేసి వారిని వెనుక నుంచి పంపించి, రేపు నేరుగా మీ మీ స్కూల్స్‌కు పంపిస్తామని వారికి చెప్పి వెళ్లగొట్టారు. అదేవిధంగా సమావేశానికి ఎందుకు వచ్చారని బయట ఎవరైనా అడిగితే బర్త్ డే ఫంక్షన్‌కు వచ్చామని చెప్పాలని వారికి హీతబోధ చేసి పంపించారు. దీంతో చేసేది లేక టీచర్లు ఉత్త చేతులతో తమ తమ ఇంటికి చేరుకున్నారు. మరుసటీ రోజు ఉదయం ఆయా స్కూల్స్‌కు వారి మనుషులతో చీరలు పంపిణీ చేయించారు. ష్... గప్‌చుప్ అంటూ ఆ నాయకుడు లోలోపల పనులు కానిచ్చేస్తున్నాడు. ఓట్ల కోసం వర్గాల వారిగా ప్రత్యేక ప్యాకెజీలను అమలు చేస్తుండటంతో పలువురు విస్తుపోతున్నారు. ఓటర్లకు నచ్చింది ఇచ్చి ఓట్లు దండుకోని అందలం ఎక్కాలని ఆ నాయకుడి పాట్లు అన్ని ఇన్ని కావు సుమా... మచ్చుకు ఒక్క సమావేశం గురించే చెప్పుతున్నాము ఇలాంటి సమావేశాలు నిత్యం ఎన్నో జరుగుతున్నాయి.

## పాలేశ్వర స్వామి శివాలయం గుడి పునఃనిర్మాణం



**యాచారం నవంబరు17,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మల్కేజీ గూడ గ్రామంలోని పాలేశ్వర స్వామి శివాలయం గుడి పున: నిర్మాణం కోసం శుక్ర వారం నుండి పూజారి దేరంగుల నరసింహ ప్రతి ఊరు తిరుగుతూ విరాళాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని ప్రతి ఊరు తిరిగి విరాళాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎవరైన సాయం చేసిన పాలేశ్వరం స్వామి అనుగ్రహం పొందుతారని అందరూ సహకరించి గుడి పునర్నిర్మాణంలో భక్తులు అందరూ భాగస్వాములై సహకరించాలని కోరారు.

## తాండూర్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం

**కోట్‌పల్లి, నవంబరు 17, ప్రభాతవార్త :** తాండూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి గెలిపొందడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పతాంగెపాండు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్ అన్నారు, శుక్రవారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలో తాండూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని కోట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందరూ కలిసి పెద్ద ఎత్తున ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్‌దొర, రవిగౌడ్, ఉదయ్‌కుమార్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## నేటి బాలలే రేపటి పౌరులు



బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**పెద్దేముల్, నవంబరు 17, ప్రభాతవార్త:** నేటి బాలలే రేపటి పౌరులని ప్రదానోపాధ్యాయులు నర్సింహయ్య అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని యంపిపిఎస్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా భాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థులు డీఈఓగా నరేష్, యంఈఓగా ప్రసాద్ చక్కగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సింహయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. కష్టంతో పాటు ఇష్టపడి చదివితే దేనినైన అవలీలగా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మెన్ సి.రాములు, ఉపాధ్యాయులు జే.శ్రీనివాసులు, రవిందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాధ, వెంకటలక్ష్మి, నఫీజ్ సుల్తాన, సంగీత పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవు

**-శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరిక**



మొయినాబాద్‌లోని మద్యం దుకాణంను తనిఖీ చేస్తున్న చేవెళ్ల ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీలత

**చేవెళ్ల, నవంబర్ 17, ప్రభాతవార్త**

తెలంగాణలో జరుగుతన్న ఎన్నికల నబందనల ప్రకారం మద్యం విక్రయాలు చేయాలని, నిబందనలు ఉల్లంగించి మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని శంషాబా ద్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ప్రగతి రిసార్ట్‌లో చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగం పల్లి నియోజకవర్గాలకు సంబందించిన ఎన్నికల పరిశీలకులు శిల్పగుప్తా, జనార్ధన్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం మొయినాబాద్ మండలం పరిదిలోని పలు మద్యం దుకాణా లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం దుకాణాల యాజమానులు బల్క్, టోకెన్ అమ్మకాలను చేయవద్దన్నారు. ప్రభుత్వ నిబందనల ప్రకారం మాత్రమే మద్యం విక్రయాలు చేయాలన్నారు. నిబందనలు ఉల్లంగించిన దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీలత, శంషాబాద్ ఎక్సైజ్ సిఐ దేవేందర్‌రావు, శేరిలిం గంపల్లి ఎక్సైజ్ సిఐ లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యం

**- బుయ్యని మనోహర్‌రెడ్డి**



రుక్మాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు

**పెద్దేముల్, నవంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కుటుంబ పాలనతో ప్రజలు విసిగి వేసారుతున్నారని, మార్పు కోసం కలిసి కట్టుగా పోరాడ వలసిన సమయం అసన్నమైందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని కందనెల్లి, ఖానాపూర్, రుక్మాపూర్, రెగొండి, కొండాపూర్, మన్‌సాన్‌పల్లి, మారెపల్లితాండా, దుగ్గాపూర్, జనగాం తదితర గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారేంటీలను చూసే ఆయా పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నితికి కాంగ్రెస్ ఎంతో కృషిచేసిందని గుర్తుచేశారు. రుక్మాపూర్‌లో బిఆర్ఎస్‌కు చెందిన ఎస్.క్రిష్ణ ఎస్.ప్రభాకర్, ఎస్.శివప్ప, పి.మొగులప్ప, వెంకటయ్య, ఎస్.వెంకటయ్య, ఎస్.శేఖర్, పి.సాయమ్మ వార్డు మెంబర్, ఎస్.మొగులప్ప, కే.ఈశ్వరమ్మ, ఎస్.అనంతమ్మ, ఎస్.శ్రీకాంత్, ఎస్.పద్మమ్మ, టి.మానేమ్మ, ఎస్.అంజిలమ్మ, టి.సాయులు, టి.ఆనంద్, ఎస్.ప్రశాంత్, ఎస్.ఆంజనేయులు తదితరులు సందమోల్ల శ్రీనివాస్, సురేందర్ ఆధ్వర్యంలో డీసీసీబి చైర్మెన్ మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబి మాజీ చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, మాజీ జడ్‌పిటిసి రాకేష్ మహరాజ్, వైస్ యంపిపి మధులత, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రియాజ్, జిల్లా మహీళా అధ్యక్షురాలు శోభారాణి, పెద్దేముల్ సోసైటీ డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ జితేందర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, సర్పంచ్ కుర్వ శివలీల, సీనియర్ నాయకులు రాంగోపాల్, ఎన్ ఎల్లారెడ్డి, మధుసుధన్‌రెడ్డి, రుద్రారం మహీపాల్‌రెడ్డి రాధక్రిష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఇవ్వలేనోడు ,సన్నబియ్యం ఇస్తాడా : గడ్డం ప్రసాద్



ప్రచారంలో మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్ కుమార్

**ధారూర్ నవంబరు17,ప్రభాతవార్త :** రేషన్ కార్డు ఇవ్వలేనోడు సన్నబియ్య ఇస్తాడా అని వికారాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం ధారూర్ మండల పరిధిలోని కేరెల్లి, కొండాపూర్ ఖర్ద్, బాచారం, ఎబ్బనూరు హరిదాసుపల్లి, చింతకుట, రుద్రారంతో పాటు పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓట్లు రాగానే వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్న వారి మాటలు నమ్మవద్దని అన్నారు. కెటిఆర్ అమెరికా, దుబాయ్ ఎందుకు వెళుతున్నాడో నాకు తెలుసని అధికారంలోకి రాగానే చూపిస్తామన్నారు. గ్రామానికి రావాల్సిన అవార్డును ఎమ్మెల్యే పక్కా మండల గ్రామానికి అమ్ముకున్నారని మండిపడ్డారు. కెసిఆర్‌కు లాభం ఉన్న పథకాలు తప్ప ప్రజలకు అవసరమైన అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడినడ, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు రాంరెడ్డి, మాజీ ఎంపిటిసి మాన్సింగ్, ఎంపిటిసి బసప్ప, రవి, శీను, ధారూర్ మాజీ ఉప సర్పంచ్ యూనుస్ బాబా ఖాన్, మన్‌సింగ్, రాంపూర్ సర్పంచ్ పాండు నాయక్, బోడ అనిల్ కుమార్, బిసి సినియర్ నాయకులు బుజ్జయ్య గౌడ్, నర్సిమ రెడ్డి, లింగంపల్లి అశోక్ ముదిరాజ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ను గెలిపించండి...ప్రసాద్‌ను దీవించండి**

**మర్పల్లి మండలంలో :** మర్పల్లి మండలంలోని పిల్లిగుండ్ల, గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మాజి మంత్రి ప్రసాద్‌కుమార్ కుతురు అనన్య, గడుప గడపకు ప్రచారం నిర్వ హించారు మండల పార్టీ అధ్యక్షులు రవెందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు క్రిష్ణరెడ్డి, నాయకులు సంజీవరెడ్డి సురేష్ పలువురు నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్యహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మాజి మంత్రి గడం ప్రసాద్ కుమార్‌ను గెలి పించాలని బీఆర్ఎస్ పార్టీ వారి మాటలు నమ్మరాదని, వారు ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం : పామెన భీంభరత్

**చేవెళ్ల, నవంబర్ 17, ప్రభాతవార్త**

చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంను జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం పలుగుట్ట, కందవాడ, నారాయన్‌దాస్‌గూడ, ఏర్రోనికోటాల, మల్లారెడ్డిగూడ, అల్లావాడ, ఇక్కరెడ్డిగూడ, చన్‌వల్లి, కేసారం, గోల్లగూడ తదితర గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాలల్లో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని, కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే మంత్రి కెటిఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అరచివేతకు గురౌతున్న ప్రజలకు న్యాయం కావాలని అయుదం పట్టానని, దొరల పాలనను చమరీగీతం పాడాలని అడవుల బాట పట్టాను తప్పా స్వలాభం కోసం కాదన్నారు. 111 జీఓను రద్దు చేశామని ఊపదుంపుడు ప్రకటనలు చేస్తు ప్రజలను మోసం చేస్తున్నారని, రద్దు చేసిన ఉత్తర్వులను మాత్రం ఎందుకు చూపించడంలేదన్నారు. సమస్యలపై ఉద్యమం చేసినప్పుడు మంత్రి కెటిఆర్ ఎక్కడ ఉన్నాడో కూడ తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల కోసమే పోరాటం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గాలికి బిఆర్ఎస్ కోట్టుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్వంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సున్నపు వసంతం, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రెడ్డిశెట్టి మదుసూదన్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, నర్సింలు, మాజి ఎంపిటిసిలు నర్సింహరెడ్డి, పెంటయ్యగౌడ్, చేవెళ్ల సర్పంచ్ శైలజ, ఉప సర్పంచ్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ టెకులపల్లి శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ అద్యక్షుడు పెంటారెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి, మహిళ అద్యక్షురాలు దేవర సమతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సరిత ప్రతాప్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, బందారు వెంకట్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రభాకర్, పాండు, గోపాల్, సిపిఐ నాయకులు రామస్వామి, ప్రభులింగం, ఎండి మక్బూల్, సుభాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగ అవకాశాలు

**-మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్**



నాగారం మున్సిపాల్టీ రాంపల్లి, అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్‌మీటింగ్‌లో పాల్గొన్న మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్, పార్టీ నాయకులు

**కీసర, నవంబరు 17, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తానని, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలిపించాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ ప్రజలను కోరారు. శుక్రవారం సాయంత్రం కీసర మండలం నాగారం మున్సిపాల్టీలోని రాంపల్లి, అంబేడ్కర్ చౌరస్తా పలు చోట్ల కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగ కాంగ్రెస్ పార్టీ రోడ్‌షో, కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. మేడ్చల్ నుంచి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగ మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు నోచుకోలేదన్నారు. మంత్రి మల్లారెడ్డికి ప్రైవేట్ కళాశాలల మీద ఉన్న శ్రద్ద ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలను మంజూరు చేయాలని లేకుండ పోయిందని ఆయన విమర్శించారు. . ఈ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని, మేడ్చల్‌లో తాను ఎమ్మెల్యేగా గెలిచాక విద్య, ఉపాధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలని వజ్రేశ్‌యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. నాగారం మున్సిపాల్టీలోని వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అంధకారమే : ఎమ్మెల్యే ఆనంద్

**మర్పల్లి నవంబర్ 17 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారం ఇస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని 35 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో జరుగని అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలో జరిగిందని వికారాబాద్ ఎమ్మెల్యే డా,మెతుకు ఆనంద్ అన్నారు మర్పల్లి మండలంలోని జంషదపూర్ రాంపూర్, పట్లూర్‌తండాలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే, ఆనంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాభివృద్ధి తో పాటు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు దక్కిందన్నారు అధికార దాహంతో కల్లీ, బొల్లీ మాటలు చెపే కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేశారో రాష్ట్రాభివృద్ధి మరో 20 సంవత్సరాలు వెనక్కి పోతుందని అన్నారు. ఈసమావేశంలో బిఆర్ఎస్ పాలనలో గిరిజన తండాలుగిరిజన తాండాలను అభివృద్ధి చేసి, ఘనత బిఆర్ఎస్‌పార్టీదని పార్టీ ప్రదాన కార్యదర్శిఆశోక్ అన్నారు జడ్పిటీసి మధుకర్, ఎంపీటీసి, బట్టు లలితరమేష్, మొహన్‌రెడ్డి, పార్టీ అద్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి , ప్రభాకర్‌గుప్త, మదు ,రాచన్న, శ్రీనివాస్, పలువురు నాయకులు ,సర్పంచ్‌లు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

**గ్రామాలను అభివృద్ధి చేసిందే కెసిఆర్ : డాక్టర్ సబితా ఆనంద్**

**ధారూర్ మండలంలో :** గ్రామాలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కెసిఆర్ అని వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి సబితా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లిపూర్, హరిదాసు పల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుజాత వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపిపి ఉమా పార్వతి, గ్రామ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

# ప్రతీ ఇంటికెళ్లి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి : శరత్‌చంద్ర

**-ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ పంపిణీపై అవగాహన సదస్సు**

**నార్సింగి, నవంబర్ 17 ప్రభాతవార్త :**

బిఎల్ఓలు ప్రతీ ఇంటికి వెళ్లాలని, ఓటర్లను కలిసి ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను అందజేయాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్, యాక్టివిటీ నోడల్ ఆఫీసర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూడ కార్పోరేషన్ కార్యాలయంలో స్లిప్‌ల పంపిణీపై బిఎల్ఓలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమీషనర్ మాట్లాడుతూ మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటరు సమాచారంను సేకరించి సంబంధిత సూపర్ వైజర్లకు ఇవ్వాలని సూచించారు. ఈ ఓటరు స్లిప్‌ల పంపిణీని 22.వ,తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలు ముగిసేంత వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లే పాలకులను ఎన్నుకుంటారని, బూత్‌లలో ఓటర్లకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రతీ ఒక్కరూ బూత్ వరకు వచ్చి ఓట్లు వేసేలా బిఎల్ఓలు ప్రోత్సహించాలని కమీషనర్ శరత్‌చంద్ర సూచించారు.




ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ పంపిణీపై బిఎల్ఓలకు అవగాహన కల్పిస్తున్న స్వీప్ యాక్టివిటీ నోడల్ ఆఫీసర్ బి.శరత్‌చంద్ర.

# నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతే



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జైభారత్ ఉద్యమ కారులు

**ఇబ్రహీంపట్నం, నవంబరు 17, ప్రభాతవార్త:**

ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపించే డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్ అందకారంలోకి వెల్తుందని జైభారత్ సామాజిక విప్లవ రణభేరి ఎస్సి పోరాట వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు జెట్టి నర్సింగ్ అన్నారు. ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి.. .ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి, డబ్బుకు ఓటు అమ్ముకుంటే బ్రతికున్న శవంతో సమానం అనే గోడ పత్రికను శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నికల్లో రాజకీయ నాయకులు ధనప్రలోబాన్ని, ఓట్ల కొనుగోలును ఎండకడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల ఓటర్ల బాధ్యతను చాటిచెప్తుతూ జైభారత్ 'జస్ట్ ఓట్'' క్యాంపెయిన్‌ను తెలంగాణ వ్యాప్తంగా ఉదృతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ధన స్వామ్యంగా మారిపోయిన ఇలాంటి వ్యవస్త కోసమా గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి మహనీయిలు జీవితాన్ని అర్పించిందని ప్రశ్నించారు. ధనిక నాయకులు గెలుపు కోసం కోట్ల రూపాయల డబ్బును ఎరగా వేస్తుంటే సామాన్యులు పోటీ చేసే దిశగా కన్నెత్తి చూసే పరిస్థితి లేదని ఆందొళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మచ్చ గీత, గోపి, సాత్విక్, లావణ్య, నరేందర్, అంజనేయులు, మనోజ్, ధనుష్, సాత్విక్ తదితరులున్నారు.

## విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన సదస్సు



విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

**ఇబ్రహీంపట్నం, నవంబరు 17, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ భవిష్యత్ ఉద్యోగావకాశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రెన్సిపిల్ డా౹౹కె.ప్రభు అధ్యక్షతన జరిగింది. వివిధ ఉన్నత విద్యా కోర్సులు, ఉద్యోగ సాధన కోసం జనరల్ స్టడీస్ యొక్క ప్రధాన్యత, భవిష్యత్ ఉద్యోగావకాశాలు, విద్యార్థులు తమ భవిష్యత్ కార్యాచరణపై ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్లు డా౹౹బెల్లంకొండ రాజశేఖర్, డా౹౹గొరిగె వెంకటయ్య అవగాహన కల్పించారు. కళాశాల ప్రెన్సిపాల్ డా౹౹కె.ప్రభు మాట్లాడుతూ..ఇలాంటి సదస్సులు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశంగా ఉంటాయన్నారు. ఆధ్యాపకులకు ప్రొఫెసర్ రాజశేఖర్ న్యాక్‌కు సంభందించిన వివిధ అంశాలపై ఆవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెరియర్ గైడెన్స్ కన్వీనర్ సమన్వయ కర్త డా౹౹ పి.పద్మజ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దు



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కెఎస్ రత్నం సతీమణి ప్రమీల

**షాబాద్, నవంబర్ 17, ప్రభాతవార్త :**

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల అన్నారు. మండల పరిధిలోని మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, మల్లారెడ్డిగూడ, ఎర్రోనిగూడ, పటేల్‌గూడ, అప్పరెడ్డిగూడ, లింగారెడ్డి గ్రామాల్లో శుక్రవారం బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70ఏళ్ల పాలనలో పేదల బ్రతుకులు ఏమి మార్చలేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. డబుల్ ఇంజన్ సరా ్కర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిరణ ,జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు రవీందర్‌రెడ్డి, మాణెయ్య, మహేందర్, నారాయణ, మహేష్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్దాయి పోటీల్లో విజయం సాధించిన గురుకుల విద్యార్థులు

**కొడంగల్ నవంబర్ 17ప్రభాతవార్త**

జిల్లా స్దాయి పోటీల్లో కొడంగల్ మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. ఈనెల 16న నిర్వహించిన 76వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్దాయి సెలక్షన్‌లో అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి డి.కౌమిక్ మంచి ప్రతిభ కనబర్చారు. అలాగే అండర్-17 విభాగంలో కె.రాఘవేంద్ర, ఎన్, భాస్కర్, జీ.వెంకటేష్‌లు రాణించారు. అలాగే కబడ్డీ పోటీల్లో స్దానిక మహాత్మా జ్యోతిభా పూలే కొడంగల్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ప్రతినిత్యం వహించి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్దాయి పోటీలకు 4గురు విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌బాబు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర బృంధం, పాఠశాల పీఈటీ పరుశురాముడు అభినందించారు.

## కాంగ్రెస్‌లో చేరిన పిల్లగుండ్ల బీఆర్ఎస్ నాయకులు

**వికారాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త;**

కాంగ్రెస్‌లో చేరిన పిల్లగుండ్ల బీఆర్ఎస్ నాయకులు మర్పల్లి మండల పరిధిలోని పిల్లగుండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 50 మంది నాయకులు శుక్రవారం నాడు సుభాష్‌యాదవ్, కొండల్‌రెడ్డిల ఆధ్వర్యంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకోని కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు గొల్ల విఠల్, ఎర్రరాజు, గొల్లరాజు, లక్ష్మీ నారాయణ, లక్సీమాన్ చారి, మల్లయ్య, అజంఅలీ, గౌసొద్దీన్, అక్తర్, బేగరి నర్సింలు, గౌండ్ల ఆంజనేయులుతో పాటు 50,మంది నాయకులు ఉన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ ు గెలిపించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు,

## యువకుడి అదృశ్యం

**షాబాద్, నవంబర్ 17, ప్రభాతవార్త :**

యువకుడు అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల ఆకాష్ పదవ తరగతి చదువుతున్నాడు. గత మూడు రోజులుగా కనపడటం లేదని, బంధువుల వద్ద, స్నేహితుల వద్ద ఎఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. గ్రామ సమీపంలో పెద్ద గుంతలో దూకాడని అనుమానించి రెండు రోజులుగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు.

ఎంత వెతికిన ఆచూకి లభించకపోవడంతో గుంతలో దుకాడా లేక ఎక్కడికైన పారిపోయాడా అని తెలియాల్సి ఉంది. ఆకాష్ ఆచూకీ లభిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

**Format C-1**
(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases
(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: SHRI B MANOHAR REDDY S/O LATE.B.BALKISHTA REDDY H.NO: 2-2-162/A, SHANTHI NAGAR, TANDUR TOWN, VIKARABAD DIST
Name of political party: INDIAN NATIONAL CONGRESS
Name of Election: LEGISLATIVE ASSEMBLY – 2023
Name of the State: TELANGANA
*Name of Constituency: 56-TANDUR ASSEMBLY CONSTITUENCY

I B MANOHAR REDDY (name of candidate), a candidate for the above mentioned election declarefor public information the following details about my criminal antecedents:

TABLE

| | | | | |
|---|---|---|---|---|
| (a) | Case No. | NIL | NIL | NIL |
| (b) | Name of the Court | NIL | NIL | NIL |
| (c) | Sections or Acts/Codes involved (give no. of the section e.g. Section of IPC, etc.). | NIL | NIL | NIL |
| (d) | Brief description of offence for which convicted | NIL | NIL | NIL |
| (e) | Dates of orders of conviction | NIL | NIL | NIL |
| (f) | Punishment imposed | NIL | NIL | NIL |
| (g) | Whether any appeal has been filed against conviction order (Mention YES or NO) | NO | NO | NO |
| (h) | If answer to (g)above is YES, give details and present status of appeal | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE |

(6A) I have given full and up-to-date information to my political party about all pending criminal cases against me and about all cases of conviction as given in paragraphs (5) and (6)

(candidates to whom this item is not applicable should clearly write NOT APPLICABLE IN VIEW OF ENTRIES 5(I) AND 6 (I), above.

Sd- B MANOHAR REDDY,56 – TANDUR Candidate.